క్లుప్తంగా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి


డాక్టర్ శివకుమార్

సిద్దవటం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధుల లక్షణాలుంటే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రికార్డుల పరిశీలన


రికార్డులను పరిశీలిస్తున్న అధికారిణి పార్వతి

పెనగలూరు : ఓబిలి, అనంతంపల్లి గ్రామ సచివాలయంలోని రికార్డులను పంచాయతీ డివిజనల్ అధికారిణి పార్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందికి ఆమె పలు సూచనలు, సలహాలు చేశారు. రికార్డులను ఏ విధంగా రాయాలి, ఎలా ఉంచుకోవాలనే విషయాలపై వారికి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో ఏఓ పద్మభూషన్ రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


నారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా అధికారులచే ప్రశంసాపత్రం పొందిన తెలుగు ఉపాధ్యాయుడు పాన్యం నారాయణకు మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు చెంగా శ్రీనివాసులు, సుధాకర్, విజయ్ భాస్కర్, ప్రదీప్ రెడ్డి, తులసి, లావణ్య, సంపూర్ణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 75 వేలు పలికిన గణపతి నగర్ లడ్డూ


లడ్డూను దక్కించుకున్న సుగవాసి శ్యాంకుమార్

నందలూరు (రాజంపేట) : నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గణపతి నగర్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన వేలంపాటలో వినాయకుని లడ్డూ రూ. 75 వేలు ధర పలికింది. ఈ లడ్డూను వేలంపాటలో గెలుచుకున్న చొప్పా సుబ్బారెడ్డికి ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ చేతులమీదుగా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ లీడర్ పునగాని గుణ యాదవ్, గణపతి నగర్ ప్రజలు పాల్గొన్నారు.

లడ్డూ దక్కించుకున్న వైఎస్సార్‌సీపీ నేత

రాయచోటి : భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన గణపతి లడ్డూను వేలంపాటలో 2వ వార్డు కౌన్సిలర్ సుగవాసి పద్మావతి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు సుగవాసి శ్యాంకుమార్‌లు రూ.77,116కు దక్కించుకున్నారు. రాయచోటి పట్టణం మాసాపేట రెడ్డివారిపల్లి యూత్ ఆధ్వర్యంలో ఒంటెరు బ్రదర్స్ ఏర్పాటు చేసిన విగ్రహ నిమజ్జనం కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో స్థానికులతో కలిసి వార్డ్ కౌన్సిలర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తత అవసరం


సిద్దవటం పోలీసు స్టేషన్‌లో వైఎస్సార్ జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

సిద్దవటం: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరగకుండా చూడాలని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. వైఎస్ఆర్ జిల్లా సిద్దవటం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్, పరిసర ప్రాంతాలను ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, సిద్దవటం ఎస్ఐ లక్ష్మీ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే మెరుగైన ఆరోగ్యం

- గర్భిణులు, బాలింతలకు బలవర్ధకమైన ఆహారంపై అవగాహన
- ప్రభుత్వం అందిస్తున్న పోషక పదార్థాల వినియోగాన్ని తెలియజేసిన అధికారులు


పుల్లంపేట: పౌష్టికాహార విశిష్టతను వివరిస్తున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి


సిద్దవటం: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శ్రీవిద్య

పుల్లంపేట : పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడం వలన మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోషక ఆహార మాసోత్సవాలలో భాగంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి మాట్లాడుతూ ప్రాచీన కాలంలో పూర్వీకులు సజ్జలు, రాగులు, జొన్నలు పండించి తినేవారని, అందువల్ల వారు వంద సంవత్సరాలు జీవించగలిగేవారని తెలిపారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులు వినియోగంతో పంటలు పండించడం ద్వారా ఆ ఆహారాన్ని తిని చిన్నారులు, వృద్ధులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ప్రభుత్వం అందించే పోషక పదార్థాలతో కూడిన ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు సీడీపీఓ సౌభాగ్యమ్మ, అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారిణి సరళాదేవి, సూపర్‌వైజర్లు మణెమ్మ, ఎం.జయలక్ష్మి, వై.నిర్మలాదేవి, ఎంపీడీఓ రఘురాం, డాక్టర్ సానే శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బోగా పార్థసారథి, ఆలం చెంగయ్య, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం మండలంలో..

రామాపురం : తల్లులు, బాలింతలు పౌష్టికాహారం ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిడిగారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం వద్ద చిరుధాన్యాలు ఎలా వండాలనే విషయంపై మంగళవారం తల్లులకు, బాలింతలకు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లులు, బాలింతలు తీసుకొనే ఆహారం చిరుధాన్యాలతో వంటను ఏ విధంగా తయారు చేయాలో చూపించారు. తల్లులు, గర్భిణులు క్రమం తప్పకుండా సరైన సమయానికి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు పద్మజ, హుస్సేనమ్మ, పంచాయతీ కార్యదర్శి ఓబులమ్మ, అంగన్వాడీ కార్యకర్త, వలంటీర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవిద్య సూచించారు. సిద్దవటం మండలంలోని బంగారుపేట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించి, పోషకాహార పదార్థాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ శ్రీవిద్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం వల్ల బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, పప్పుదినుసులు వంటి ఆహారపదార్థాలను తీసుకుంటే తల్లి, బిడ్డ ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. అనంతరం బాల్య వివాహాల నిరోధక చట్టంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదిరతులు పాల్గొన్నారు.


రామాపురం: గర్భిణులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ పద్మావతి, అంగన్‌వాడీలు

ఘనంగా ఉరుసు

సిద్దవటం : మండల కేంద్రం పరిధిలోని ఎగువపేటలో ఉన్న చారిత్రాత్మకమైన ఫత్తుమియ్యా దర్గాలో మిలాద్-ఉన్-నబి సందర్భంగా మంగళవారం ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించినట్టు ముతవల్లి సయ్యద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. ఉరుసు సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వస్తువులను ప్రదర్శించామన్నారు. ఉరుసు కార్యక్రమానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రామాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలియజేశారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి


ఈ-పంటపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీలత

సంబేపల్లె : మండలంలోని నాగిరెడ్డిగారిపల్లి, దేవపట్ల గ్రామాల పరిధిలో ఈ-క్రాప్ నమోదును సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడీఏ శ్రీలత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్-2023 సంవత్సరానికి గాను గ్రామంలో పంట సాగు చేసిన ప్రతి రైతు పొలాన్ని సందర్శించామన్నారు. ఇప్పటివరకు ఈ - క్రాప్‌ను నమోదు చేసుకోని రైతులు త్వరితగతిన వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కిషోర్ నాయక్, ఆర్‌బీకే సిబ్బంది సౌజన్య, అబిద్ ఖాన్, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

చెరువులను వెలిగల్లు నీటితో నింపుతాం

- నాయకులు, రైతులతో కలిసి గంగమ్మకు పూజలు చేసిన గడికోట మోహన్ రెడ్డి


రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : రైతులకు వెల్లిగల్లు ప్రాజెక్టు వరప్రదాయిని అని లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దిన్నెపాడు గ్రామంలోని స్థానిక నాయకులు, రైతులతో కలిసి పందిళ్లపల్లె, కుర్నూతల, మద్దిరేవుల నుంచి దిగువ ప్రాంతమైన రామరాజు వంకకు వెలిగల్లు నీరు చేరి చెక్ డ్యామును తలపిస్తుండటంతో గంగమ్మతల్లికి పసుపు, కుంకుమను సమర్పించి కొబ్బరికాయలు కొట్టి పూజలు నిర్వహించి ఆనందాన్ని రైతులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాయచోటి పట్టణం, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు మండలాలకు తాగునీరుతోపాటు సాగుకు దోహదం చేస్తున్న ప్రాజెక్ట్ వైఎస్సార్ వెలిగల్లు అని తెలియజేశారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కృషి ఫలితంతోనే నేడు ఈ ప్రాంత రైతులు అభివృద్ధి ఫలాలను చూస్తున్నారన్నారు. ప్రస్తుతం వైఎస్ జగన్ హయాంలో పుష్కలంగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారిందన్నారు. 2019 ఎన్నికలలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, రామాపురం మండలాల్లోని చెరువులకు నేడు సాగునీరు అందిస్తున్నారన్నారు. మరో రెండు నెలలపాటు కాలువలు ద్వారా వెలిగల్లు నీరు మిగిలిన గ్రామాల్లోని చెరువులకు చేరుతాయన్నారు. రైతులు నీటిని వృథా చేయకుండా పంటలు సాగు చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సిపి నాయకులు ప్రసాద్ రెడ్డి, గజేంద్ర రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టండి

సిద్దవటం : మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలలో దోమల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. మండలంలోని మాధవరం-2 గ్రామ సచివాలయంలో మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల గ్రామ పంచాయతీలలో పారిశుధ్యం లేకుండా చూడాలని కార్యదర్శులకు తెలియజేశారు. మురికినీరు నిల్వ ఉన్న చోట లార్వా ఉత్పత్తి కాకుండా అబెట్ ద్రావణం, బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించాలన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు మండలం స్థాయిలో ఒక కమిటీని, గ్రామ పంచాయతీ స్థాయిలో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీనరసయ్య, సుజాత, రాజశేఖర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయంలో మేరీ మిట్టి.. మేరా దేశ్


రాజంపేట: సేకరించిన మట్టితో ఎంపీడీఓ సౌభాగ్యమ్మ

నందలూరు (రాజంపేట) : మేరీ మిట్టి - మేరా దేశ్ మహాన్ కార్యక్రమంలో భాగంగా శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయం నుంచి మట్టిని సేకరించి ఢిల్లీ అమృతవనంలో ఏర్పాటు చేయనున్న అమరవీరుల స్మారక స్థూపానికి పంపనున్నట్టు ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సూర్యనారాయణలు తెలిపారు. మంగళవారం నందలూరు పంచాయతీ, నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ, పాటూరు పంచాయతీల ఆధ్వర్యంలో మట్టిని సేకరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ సతీష్ కుమార్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, పాటూరు సర్పంచ్ మోహన్ రెడ్డి, నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, పాటూరు కార్యదర్శి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

బెటాలియన్ హైస్కూల్‌లో..

సిద్దవటం : మాతృభూమి, కన్నతల్లి కంటే గొప్పదని ఎన్ని జన్మలెత్తినా మాతృభూమి రుణం తీర్చుకోలేమని బెటాలియన్ జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. ఎం.డి. జాఫర్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సూచన మేరకు ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లో షేక్ సిరాజుల్లా ఆధ్వర్యంలో మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించామన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులు కలశాలలో మట్టి సేకరించారన్నారు. విద్యార్థులు అందరూ దేశ నాయకుల పటాలను, జాతీయ జెండాను చేతబట్టి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఉపాధ్యాయులు నాగమునిరెడ్డి, రామసుబ్బారెడ్డి, సుదర్శనరావు, సుబ్బరాయుడు, పోతులూరయ్య, పరమేశ్వరి, మాధవీలత, విద్యార్థులున్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా కంటి వైద్య నిపుణులు సురేష్ 536 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరిపారు. ఈ పరీక్షల ద్వారా దృష్టి లోపం ఉన్న విద్యార్థులను గుర్తించారు. వీరికి అక్టోబర్ నెల మొదటి వారం నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్టు వైద్యుడు పేర్కొన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి విద్యార్థులకు ఆరోగ్య సలహాలు, సూచనలు చేశారు. సమతుల ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. అమ్మ వండిన ఆహారాన్ని ఇష్టంగా తినాలన్నారు. జంక్ ఫుడ్ ఆరోగ్య సమస్యలు తెచ్చిపెడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయులు సుజాత, ఏఎన్ఎం మెహరూన్ బీ, ఆశ వర్కర్లు కె.లక్ష్మీదేవి, టి.లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ల పంపిణీ

రైల్వేకోడూరు : ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ప్రముఖ వైద్యనిపుణులు డాక్టర్ థామస్ కుమారుడు డాక్టర్ అబ్రహాం థామస్ పేర్కొన్నారు. మంగళవారం థామస్ హాస్పిటల్ నందు సీఐ మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా ఆసుపత్రి సిబ్బందికి ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు హెల్మెట్ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్లు ధరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, మురళి, సురేష్, దేవి, కోమల తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

చిన్నమండెం : మండలంలోని కలిబండ గ్రామం శ్రీ పోలేరమ్మ ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్స శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సహాయ సహకారంతో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, సర్పంచ్ జగన్నాథరెడ్డిల పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. మదనపల్లెకు చెందిన ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యవిజ్ఞాన కేంద్రం వైద్యులు రోగులకు కంటి వైద్య పరీక్షలను జరిపి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

ఒంటిమిట్టలో మాంసం దుకాణాలను తొలగించాలి


దేవస్థానం ఈఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న మాంసం దుకాణాలను తొలగించి క్షేత్ర పవిత్రతను కాపాడాలని హిందూ సంఘాల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మొదట శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం పుణ్యక్షేత్రంలో మాంసం దుకాణాలను తొలంచాలని ఒంటిమిట్ట ఆలయ ఈఓ ధనుంజయుడికి, పంచాయతీ కార్యదర్శికి, తహసీల్దారు మాధవీలతకు, ఒంటిమిట్ట పోలీసు స్టేషన్‌లో, వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పునరావాస గ్రామస్తుల సమస్యలు పరిష్కరించండి


సీపీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు, గ్రామస్తులు

ఓబులవారిపల్లె : మంగంపేట, కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ పునరావాస గ్రామ ప్రజలకు మౌలిక సదుపాయాలు, ప్యాకేజీలు తదితర సమస్యలు పరిష్కరించాలని బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం సీపీఓ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పీర్‌మున్నీలకు వినతిపత్రం అందించారు. సంఘం అధ్యక్షుడు పి.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ మంగంపేట ఆర్ఆర్-5లో శ్రీ సత్యమ్మ హనుమాన్ దేవాలయానికి స్థలంతోపాటు పశువుల మేత కోసం బీడు స్థలానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని ఇవ్వాలని కోరారు. పురాతన కాటమరాయుడు గుడికి పరిహారం, గుడివారమ్మ గుడి సంరక్షణ తదితర సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు సతీష్ రెడ్డి, కొలూరు సుబ్రమణ్యం రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాజారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

చిన్నమండెం : రాయచోటి పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్-17, అండర్-14 విభాగాలలో కబడ్డీ, త్రోబాల్, యోగా క్రీడలలో చిన్నమండెం కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎస్ఓ బి.అరుణమ్మ, పీఈటీ నాగసులోచనలు తెలిపారు. కె.సాయిజ్యోతి కబడ్డీ, టెన్నికాయిట్, త్రోబాల్ విభాగాలలో ప్రతిభ చూపగా, కె.స్నేహ కబడ్డీ, త్రోబాల్ పోటీలలో ప్రతిభ కనబరిచిందన్నారు. అదే విధంగా కె.అహల్య కబడ్డీ, త్రోబాల్, కె.త్రివేణి త్రోబాల్, జి.లిఖితారెడ్డి కబడ్డీ, బి.లోహిత యోగా పోటీలలో రాణించినట్లు వారు తెలిపారు. ఎస్‌జీఎఫ్ క్రీడలలో ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులను ఎస్ఓ అభినందించారు.

30న జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు


రైల్వేకోడూరు అర్బన్: కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

రాయచోటి : రాయచోటి జూనియర్ కళాశాల ఆవరణంలోని ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థుల ఎంపికను చేపడుతున్నట్లు స్టెప్ జిల్లా అధికారి సి.సాయిగ్రేస్ తెలిపారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో పత్రికలకు అందజేసిన ఒక ప్రకటనలో విద్యార్థుల ఎంపిక విధానాలను తెలియపరిచారు. పులివెందులలోని ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఐదు విభాగాలకు చెందిన క్రీడలలో నైపుణ్యం ఉన్న విద్యార్థులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ నెల 5వ తేదీల వరకు ఈ ఎంపికలను నిర్వహిస్తామన్నారు. బాడ్మింటన్ బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, హాకీ క్రీడలకు విద్యార్థులను ఎంపిక చేస్తారన్నారు. ఒక్కో విభాగం నుంచి 30 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు క్రీడా పాఠశాలలో శిక్షణ పొందేందుకు ఎంపిక నిర్వహణలో పాల్గొనాలన్నారు.

రైల్వేకోడూరులో ఎస్‌జీఎఫ్ఐ క్రీడలు

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని కె.బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో మంగళవారం ఎస్‌జీఎఫ్ఐ కో-ఆర్డినేటర్ డేవిడ్ ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. వివిధ క్రీడల్లో నైపుణ్యం కనబరిచిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. క్రీడల్లో కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాల నుంచి 10 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, షటిల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా వంటి క్రీడా పోటీలు నిర్వహించామన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు


ఓబులవారిపల్లె: స్టాపర్స్ ఏర్పాటు చేస్తున్న సీఐ, ఎస్ఐ, హైవే అధికారులు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించేందుకు పటిష్టమైన చర్యలను చేపట్టనున్నట్లు రైల్వేకోడూరు సీఐ మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఇటీవల ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను నేషనల్ హైవే డీఈ నాయక్, రాజంపేట ఎంవీఐలతో కలిసి సీఐ మధుసూదన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగంపేట ప్రాంతంలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నందున పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా స్టాపర్స్ ఏర్పాటు చేసి వేగాన్ని అదుపు చేసి ప్రమాదాలను నివారిస్తున్నామన్నారు. వాహనదారులు జాతీయ రహదారిపై అప్రమత్తంగా వాహనాలు నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఓబులవారిపల్లె ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నందలూరు (రాజంపేట) : ఆటో నడిపేవారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ పుల్లయ్య అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు సరైన ధృవపత్రాలు కలిగి ఉండాలని, యూనిఫాం తప్పక ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగంగా వెళ్లడం నేరమన్నారు. ఓవర్ లోడ్ ఉండకూడదన్నారు. అడ్డదిడ్డంగా ఆటోలు పెట్టకుండా కేటాయించిన స్థలంలోనే ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, ఏఎస్ఐలు రాముడు, శంకర్ నాయుడు, పోలీసులు వర్మ, మహేంద్ర, రామకృష్ణ, హోంగార్డు మేరీలు పాల్గొన్నారు.


పట్టణంలో చైన్ స్నాచింగ్

రాయచోటి : కారు ఎక్కుతున్న 70 ఏళ్ల వృద్ధ మహిళ మెడ నుంచి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. రాయచోటి పట్టణం తిరుపతి నాయుడు కాలనీలో మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటుచేసుకుంది. అపహరణకు గురైన గొలుసు 25 గ్రాములు ఉన్నట్లు సీఐ తెలిపారు. కాలనీలోని ఇంటి నుంచి ఊరికి వెళ్లేందుకు అచ్చమ్మ (70) అనే వృద్ధ మహిళ కారు వద్దకు చేరుకుంది. కారు ఎక్కుతున్న సమయంలో తోడు ఎవరూ లేకపోవడంతో కాపు కాసిన చైన్ స్నాచర్లు ఈ దోపిడీకీ పాల్పడినట్లు వృద్ధ మహిళ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు.

పొదుగు వ్యాధులు రాకుండా జాగ్రత్తపడాలి

రామాపురం : రైతులు పాడి పశువులలో అధిక పాల ఉత్పత్తి పొందాలంటే పొదుగు వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బి.రాచపల్లెలో సోమవారం విశిష్ట బడి కార్యక్రమంలో భాగంగా పాడి పశువులలో పాల ఉత్పత్తి పెంచడం ఎలా అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులలో పొదుగు వ్యాధి లక్షణాలు, పొదుపు వాపు రావడం, పాలు రంగు మారడం, పాలు పగిలిపోవడం లాంటి లక్షణాలు కనిపించినపుడు వెంటనే పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లి రైతులు వైద్యులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించాలని పశువుల పట్ల జాగ్రత్తలు పశువల పాకలు శుభ్రంగా ఉంచుకోవడం పాలు పిండే ముందు పోగులు శుభ్రంగా కడగడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాడి రైతులు, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏలో ఆలిండియా 32వర్యాంకు


గణేష్

రామాపురం : మండలంలోని కశిరెడ్డిగారిపల్లి పంచాయతీ సూర్యనారాయణపురానికి చెందిన రైతు హసనాపురం సుబ్బయ్య, గంగాదేవిల మూడవ కుమారుడు హసనాపురం గణేష్ ఆలిండియా 32వ ర్యాంకు సీఎంఏలో ర్యాంకు సాధించినట్లు మంగళవారం ఫలితాలు వచ్చాయి. గణేష్ గుంటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో సీఏ చదువుతూ 2023 జూన్‌లో జరిగిన సీఎంఏ ఫైనల్ లెవెల్‌లో జాతీయ స్థాయిలో 32వ ర్యాంకు సాధించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. దీంతో గ్రామంలోని పెద్దలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగురాలికి సత్వర న్యాయం


దివ్యాంగురాలిని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అర్హత ఉండి అనుకున్నంత పెన్షన్ రాని దివ్యాంగురాలికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ చొరవ చూపి పూర్తిస్థాయిలో పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం కాటిమాయకుంట గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంగళవారం దివ్యాంగురాలికి పూర్తిస్థాయిలో పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవడంతో స్థానిక ప్రజలు హర్షం ప్రకటించి కలెక్టర్‌ను అభినందనలతో ముంచెత్తారు. కాటిమాయకుంటకు చెందిన పర్వీన్ దివ్యాంగురాలైన తన కుమార్తె షేక్ మరియంను చూపించి పాపను పోషించేందుకు ప్రస్తుతం తనకు వస్తున్న రూ. 2750 పింఛన్ సరిపోవడం లేదని తెలిపారు. పూర్తిగా నడవలేనని పింఛన్ పెంచితే పోషించుకోగలనని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. దీంతో పాప పరిస్థితి గమనించిన కలెక్టర్ స్పందిస్తూ వందశాతం దివ్యాంగురాలైన పాపకు పూర్తిస్థాయిలో పింఛన్ అందించేందుకు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులను ఆదేశించారు. స్పందించిన వైద్యాధికారులు మెడికల్ బోర్డుకు సమాచారం ఇచ్చారు. పాపకు పూర్తిస్థాయి పెన్షన్ వచ్చేలా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.